సాక్షి చిత్తూరు

శుక్రవారం । 31 । మార్చి । 2023



వరసిద్ధుడి సేవలో అంబటి రాంబాబు

ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబు గురువారం కుటుంబ సమేతంగా కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్నారు.
- 8లో



కాణిపాకంలో హైకోర్టు జడ్జి

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత గురువారం వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు. అధికారులు వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. -8లో



పెద్దకొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం పెద్దకొట్టాయి ఉత్సవం జరిగింది. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు అభిషేక పూజలు నిర్వహించారు.



- 'ఇది పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండలం, కెళవాతి గ్రామానికి చెందిన ఎర్రబల్లి శ్రీనివాసులు ఇల్లు. నాటి టీడీపీ మంత్రి అమరనాథ్‌రెడ్డి సొంత గ్రామం కూడా ఇదే. తాను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా గెలిచి.. టీడీపీలోకి వెళుతున్నపుడు శ్రీనివాసులు పార్టీ మారలేదన్న అక్కసుతో అతనిపై పగబట్టారు. దళితుడైన శ్రీనివాసులుపై రేప్ కేసుతో పాటు మరో ఆరు కేసుల్లో ఇరికించాడు. ఊర్లో నుంచి వెలివేయించాడు. అన్నీ దిగమింగుకున్న శ్రీనివాసులు ఇప్పటికీ ఊరి చివర ఉన్న తన పొలంలో ఇల్లు కట్టుకుని జీవించాల్సిన పరిస్థితి.





- 'చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో 2017లో తాను చెప్పినట్లు రూ.10 లక్షల విలువైన బిల్లులు రాయలేదని టీడీపీ మహిళా కార్పొరేటర్ భర్త నాయుడు దౌర్జన్యానికి పాల్పడ్డాడు. దళిత మహిళా ఇంజినీరును అందరిముందే కుర్చీతో కొట్టబోయాడు. ఆమెను కార్పొరేషన్ కార్యాలయం నుంచి బయటకు పంపే వరకు శాంతించ లేదు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించినా నో కేస్!'

- 2019 సాధారణ ఎన్నికల సందర్భంగా పూతలపట్టు నియోజకవర్గం, ఐరాల మండలం, కట్టకిందపల్లి గ్రామ పరిధిలోని దళితులను ఓట్లేయనీయకుండా టీడీపీ నేతలు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ బాబు గ్రామానికి వెళ్లి దళితులకు ధైర్యం చెప్పారు. అనంతరం తిరిగి వెళ్తుండగా చెరువు వద్ద ఆయన్ని అటకాయించి దాడిచేశారు. ఆయన ప్రయాణిస్తున్న కారును ధ్వంసం చేశారు. రక్తగాయాలతో ఎంఎస్ బాబు ఆస్పత్రి పాలయ్యారు. తవణంపల్లి మండల పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నేతలు అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయించారు.



దళితులపై దాడిచేసి.. ప్రభుత్వంపై నిందలేసి!

- చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో 2014–2019 కాలంలో దళితులపై దాడులకు సంబంధించి 54 కేసులు నమోదయ్యాయి. రామకుప్పం మండలంలో అప్పటి సీఎం చంద్రబాబు దిష్టి బొమ్మ దహనం చేశారని 2017లో 14 మందిపై కేసులు నమోదు చేశారు. తమిళనాడు నుంచి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని పట్టించినందుకు సెంథిల్‌కుమార్, మురుగేష్‌పై అక్రమ కేసులు బనాయించారు.

.... ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. 2014 నుంచి ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్న టీడీపీ హయాంలో దళితులపై జరిగిన దమనకాండ అంతాఇంతకాదు. ఇటువంటి సంఘటనలు కోకొల్లలు. ఎలాంటి సాక్ష్యాలు లేకుండా ఎందరో దళితులను ఇబ్బందులకు గురిచేసిన చిట్టా చాలా పెద్దగానే ఉంది. ఇదంతా కప్పిపుచ్చిన పచ్చ మీడియా ఇప్పుడున్న ప్రభుత్వంలో దళితులపై దాడులు పెరిగాయని.. అప్పట్లో దళితులకు చంద్రబాబు నాయుడు రెడ్ కార్పెట్ పరచారంటూ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టే యత్నం చేయడం విస్మయానికి గురిచేస్తోంది.

- టీడీపీ హయాంలో దళితులపై దౌర్జన్యకాండ
- ఓట్లేయనీయకుండా అడ్డుకున్న చంద్రబాబు
- ఊర్లు వదిలి వెళ్లిన దళితకుటుంబాలు
- ప్రశ్నించినందుకు నాడు ఎంఎస్ బాబుపైనా దాడి

సాక్షి, తిరుపతి/చిత్తూరు అర్బన్: దళితులుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా..? ఈ మాట వింటే ఠక్కున గుర్తుకొచ్చేది ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకుని చంద్రబాబు పేరే. ఆయన హయాంలో జిల్లాలో దళితులపై దాడుల పరంపర కొనసాగింది. అంతెందుకు కనీసం ఓట్లు కూడా స్వేచ్ఛగా వేయలేని దుస్థితి ఏర్పడింది. వాటికథ.. కమామీసు మీకోసం..

దళితులపై దండయాత్ర

చంద్రగిరి నియోజకవర్గం, రామచంద్రాపురం మండల పరిధిలోని కమ్మకండ్రిగ, కమ్మపల్లి, రావిళ్లవారిపల్లి, ఎన్‌ఆర్ కమ్మపల్లి, గణేషపురం, టీటీ కండ్రిగ పరిధిలోని దళిత, గిరిజనులు ఊర్లోకి వచ్చి ఓట్లేయనీకుండా టీడీపీ నాయకులు అడ్డుకునేవారు. పోలింగ్ బూత్‌లలోకి దూరి రిగ్గింగ్‌కు పాల్పడేవారు. 2019 మే 11న ఓటేసేందుకు వెళ్తున్న పలువురు దళిత, గిరిజనులపై దాడులు చేశారు. వారికి మద్దతుగా వెళ్లిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపైనా, ఆయన సతీమణి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడికి తెగబడ్డారు. టీడీపీ దౌర్జన్యాలను కవర్ చేసేందుకు వెళ్లిన పలువురు దళిత జర్నలిస్టుల కెమెరాలు లాక్కొని తరిమి తరిమి కొట్టారు.



2019లో టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ బాబు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో..

సంవత్సరం	అట్రాసిటీ కేసులు
2014	140
2015	102
2016	139
2017	124
2018	114
2019	146

వాహనాలను ధ్వంసం చేశారు. ఈ సంఘటనపై రామచంద్రాపురం పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. చివరకు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి న్యాయస్థానాన్ని ఆశ్రయించి దళిత, గిరిజనులకు ఓటువేసే హక్కును కల్పించారు.

ఖాకీల ప్రేక్షక పాత్ర

టీడీపీ హయాంలో దళితులపై దాడులు జరుగుతున్నా పోలీసుశాఖ అడ్డుకట్ట వేయలేకపోయింది. నాడు జిల్లా పోలీసు బాసు నుంచి అప్పటి ప్రత్యేక విభాగం ఉన్నతాధికారి వరకు అందరూ పెద బాబు, చిన బాబు, నాటి మంత్రి కనుసన్నల్లో మెలిగేవారు. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజినీరుపై దాడికి యత్నించినా.. ఇక్కడున్న ఓ దళిత ఉద్యోగి చెంప చెళ్లు మనిపించినా అడిగే దిక్కు లేకుండాపోయింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఎంతోమంది దళిత అధికారులపై భౌతిక దాడులు చేసినా నోరెత్తలేకపోయారు. బాధిత దళితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే కార్యాలయంలో కూర్చుని పంచాయితీ చేసుకోవాలని పంపించేసేవారు. ఎక్కడా అట్రాసిటీ కేసులు పెట్టలేదు.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఐఐటీలో తిరుత్సవ్



ఐఐటీ తిరుపతి ముఖద్వారం

ఏర్పేడు: మేర్లపాక రెవెన్యూ పరిధిలోని ఐఐటీ తిరుపతి క్యాంపస్‌లో శుక్రవారం నుంచి తిరుత్సవ్ వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్టు డైరెక్టర్ కేఎన్.సత్యనారాయణ తెలిపారు. ఈనెల 31 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. 2023 ఐఐటీ తిరుపతి వార్షిక సాంకేతిక సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాల ప్రదర్శన, సాయంత్రం 7.30 నుంచి రాత్రి 10.30 గంటల వరకు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

మొదటి రోజు కార్యక్రమాలు

ట్రిజర్ హంట్, స్పాట్ లైట్ (ఫ్యాషన్ షో) రౌండ్, వన్ ఆన్, లేచెప్, బ్రిడ్జ్ బజూకా తదితర ఈవెంట్‌లు జరగనున్నాయి.

తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు



తిరుపతి అర్బన్: పౌర్ణమి సందర్భంగా ఏప్రిల్ 6 నుంచి తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. తిరుపతి నుంచి సాధారణ బస్సులతోపాటు ఏసీ బస్సులను ఏర్పాటుచేయనున్నట్టు ఆయన వెల్లడించారు. ఉదయం 6 నుంచి గంటకు ఓ సర్వీస్ చొప్పున తిప్పుతామన్నారు.

ప్రాణదాన పథకానికి 154 మంది ఎంపిక

తిరుపతి తుడా : స్విమ్స్‌లో టీటీడీ ప్రాణదాన పథకం ద్వారా పేదలకు ఉచిత శస్త్ర చికిత్సలను నిర్వహించేందుకు 150 మంది రోగులను ఎంపిక చేసినట్టు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ తెలిపారు. ఇందులో నెఫ్రాలజీ–12, రేడియేషన్ ఆంకాలజీ–13, న్యూరోసర్జరీ–34, గ్యాస్ట్రో ఎంట్రాలజీ–12, న్యూరాలజీ–26, మెడిసిన్–25, సర్జికల్ ఆంకాలజీ –14, కార్డియాలజీ–2, కార్డియోథొరాఫిక్ –10, మెడికల్ ఆంకాలజీ–5, యూరాలజీ–1 మొత్తం 154 మంది పేదరోగులను ఈ పథకానికి ఎంపిక చేసినట్టు చెప్పారు.

శ్రీరాముడి చిత్రపటం బహూకరణ

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): తొట్టంబేడు మండలం, చిన్నకనపర్తి గ్రామ సమీపంలోని దళితవాడ రామాలయానికి లక్షా ఐదు వేల రూపాయల విలువ చేసే చిత్రపటాన్ని మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి అందజేశారు. గురువారం శ్రీరామనవమిని పురస్కరించుకుని సిద్దారెడ్డి రాజారామిరెడ్డి, కమలమ్మ జ్ఞాపకార్థం శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయస్వామితో కూడిన స్వర్ణ రంగులోని చిత్రపటాన్ని ఆమె గ్రామస్తులకు అందజేశారు. సర్పంచ్ సుబ్రమణ్యం, మణినాయుడు, ఎంపీటీసీ సుబ్రమణ్యం, ధనంజయులు, గోపి, రాఘవులు పాల్గొన్నారు.

ముగిసిన ఫ్లోర్ కర్లింగ్‌పోటీలు

నెల్లూరు(టౌన్): నెల్లూరు వేదాయపాళెంలో ఉన్న ఎల్ఎల్ఎఫ్ స్కూల్లో రాష్ట్రస్థాయి కర్లింగ్ పోటీల ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఫ్లోర్ కర్లింగ్ గేమ్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి మాట్లాడుతూ సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఓవరాల్ చాపియన్‌షిప్‌ను తిరుపతి, ద్వితీయ స్థానాన్ని నెల్లూరు, తృతీయ స్థానాన్ని కర్నూలు జిల్లా క్రీడాకారులు కైవసం చేసుకున్నారని తెలిపారు. వీరు మే 19 నుంచి 21వ తేదీ వరకు అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలకు, రాణించిన క్రీడాకారులకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ట్రోఫీలు, మెడల్స్ ప్రదానం చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొండారెడ్డి పాల్గొన్నారు.

రాళ్లగంగమాంబ బ్రహ్మోత్సవాల పత్రిక ఆవిష్కరణ


గుడుపల్లె: రాళ్లగంగమాంబ ఆలయ బ్రహ్మోత్సవాల పత్రికను రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ గురువారం ఆవిష్కరించారు. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దులోని రాళ్లగంగమాంబ ఆలయంలో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 4 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆహ్వానించినట్లు ఆలయ పాలకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామమూర్తి, వెంకటాచలం, కోదండరెడ్డి, దండపాణి, వెంకటేష్, కృష్ణప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల పత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ భరత్

వైఎస్సార్ సీపీ బలోపేతానికి సమష్టి కృషి

సదుం: వైఎస్సార్ సీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. గురువారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డితో కలిసి సచివాలయాల మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డిని కలిశారు. పార్టీ జాతీయ కార్యాలయం ఆదేశాల మేరకు ఏప్రిల్ నెలలో జరగబోయే 'మా నమ్మకం– నువ్వే జగనన్న' కార్యక్రమం మండల షెడ్యూల్‌ను మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.



షెడ్యూల్‌ను పరిశీలిస్తున్న మంత్రి రామచంద్రారెడ్డి, చిత్రంలో పెద్దిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి

రామ నామం మధురం



పట్టువస్త్రాలు తీసుకెళుతున్న మంత్రి ఆర్కే రోజా సెల్వమణి దంపతులు

- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి రోజా దంపతులు

పుత్తూరు రూరల్: రామ నామం మధురం, ఆ నామ స్మరణతో జన్మధన్యమని పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. గురువారం శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని కోదండరామస్వామి ఆలయంలో మంత్రి రోజా, సెల్వమణి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్థానిక నగరం రోడ్డు నుంచి కాపువీధిలోని రామాలయం వరకు పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు మంత్రి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సీతారాములవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు మంత్రి దంపతులను ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ పది రోజులపాటు నిర్వహించనున్న నవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునికృష్ణయ్య, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, ఉత్సవ కమిటీ సభ్యులు ఆనంద్, నవీన్‌కుమార్, నాగమణి, కుమారి, వెంకటముని, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

'పది'కి పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా వ్యాప్తంగా 152 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 28,413 మంది విద్యార్థులు
- డీఈఓ డాక్టర్ వి.శేఖర్

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరగనున్నట్లు తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. తిరుపతి జిల్లాలో పది పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వెల్లడించారు. ఫలితాల్లో జిల్లా మెరుగైన స్థానం సాధించేలా విద్యార్థులను సంసిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణత సాధించేలా ఆయా పాఠశాలల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకునేందుకు నిత్యం పరీక్షలు నిర్వహించి, ఎక్కడ వెనుకబడ్డారో గుర్తించి వారికి పూర్తి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కనీస మార్కులతో పాసయ్యేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. పది పరీక్షల నిర్వహణకు సంబంధించిన వివరాలను ఆయన 'సాక్షి'కి తెలిపారు. ఆయన మాటల్లోనే..

తిరుపతి జిల్లాలో పదోతరగతి పరీక్షలకు మొత్తం 152 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఇందులో రెగ్యులర్ 26,673, ప్రైవేటు 1,740 మంది, మొత్తం 28,413 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాలను ఏ, బీ, సీ మూడు రకాలుగా విభజించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిర్వహించేందుకు పక్కాగా ఏర్పాట్లు చేశాం. పరీక్షల్లో అవకతవకలకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్లు, పది సిట్టింగ్ స్క్వాడ్లును ఏర్పాటుచేశాం. అలాగే సమస్యాత్మకమైన మూడు పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం.

వసతుల కల్పన : పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాం. గత అనుభవాల దృష్ట్యా నేల పరీక్షకు తావులేకుండా అన్ని పరీక్ష కేంద్రాల్లో డెస్కులను ఏర్పాటు చేశాం. ఎండల దృష్ట్యా తాగునీటి వసతిని కేంద్రాల్లో ఏర్పాటుచేశాం. కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్ష సమయంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా, అత్యవసర చికిత్స నిమిత్తం ప్రతి పరీక్షా కేంద్రం వద్ద వైద్య సిబ్బంది, విమర్శలకు తావులేకుండా పరీక్షల నిర్వహణకు పోలీస్ పహారా, పరీక్షల సమయంలో ఆయా రూట్లలో విరివిగా ఆర్టీసీ బస్సులు తిరిగేలా సంబంధిత అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు.

రూ.2,149 కోట్ల ఆదాయపు పన్ను వసూలు

తిరుపతి రూరల్: రాయలసీమ, నెల్లూరు జిల్లాల పరిధిలో ఈ ఏడాది రూ.2,149 కోట్ల ఆదాయపు పన్ను వసూలు చేసినట్టు ఆ శాఖ తిరుపతి చార్జ్ ప్రిన్సిపల్ కమిషనర్ దుర్గేష్‌సామ్రాట్ తెలిపారు. తిరుపతిలోని ఆదాయపుపన్ను శాఖ ప్రధాన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2022–23 ఏడాదికి రూ.1,583 కోట్ల పన్నులు వసూళ్లను టార్గెట్‌గా నిర్ణయించుకున్నామని, అయితే ఇప్పటి వరకు రూ.2,149 కోట్లను రాబట్టినట్టు చెప్పారు. తిరుపతి చార్జ్ జ్యూరిడిక్షన్ పరిధిలో మొత్తం 13,14,102 మంది పన్ను చెల్లింపుదారులు ఉన్నారని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈఏడాది నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల పరిధిలో రూ.1,811 కోట్లను రిఫండ్‌గా ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు చెల్లించినట్లు చెప్పారు. అడ్వాన్స్ ట్యాక్స్, ఇతర లావాదేవిల్లో రిఫండ్‌గా ఈ మొత్తాన్ని చెల్లించామన్నారు. వందశాతం గ్రీవెన్స్‌ను క్లియర్ చేసినట్లు తెలిపారు. గతేడాది రూ.738 కోట్లను మాత్రమే రిఫండ్ చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

పట్టువస్త్రాలు తీసుకెళుతున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, అధికారులు, మాంగళ్యం చూపుతున్న అర్చకులు





చూసిన కనులదే భాగ్యం

రఘు వంశ నందనుడు.. శ్రీరామచంద్రుడు.. జనకుని తనయ జానకి కల్యాణానికి ఆకాశమే పందిరైంది. భూదేవే వేదికయ్యింది. భక్తులే పెళ్లి పెద్దలు కాగా నీలమేఘశ్యాముడి వివాహం చూసిన కనులదే భాగ్యంగా జరిగింది. కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలోని వీరాంజనేయ ఆలయంలో గురువారం జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గణేష్ ప్రసాద్ రెడ్డి, బుజ్జిరెడ్డి, పుణ్యసముద్రం రవి తదితరులు పాల్గొని, స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. - కాణిపాకం(యాదమరి)

పరిశోధన నైపుణ్యంపై దృష్టి పెట్టండి


వైద్య విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సురేష్ కృష్ణమూర్తి

గడుపల్లె: వైద్య విద్యార్థులు పరిశోధన నైపుణ్యంపై దృష్టి పెట్టాలని పీఈఎస్ మెడికల్ డైరెక్టర్ సురేష్ కృష్ణమూర్తి సూచించారు. గురువారం పీఈఎస్ కళాశాలలో పీజీ, యూజీ విద్యార్థులకు మూడు రోజులుగా ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ నిర్వహించిన వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, ప్రసంగించారు. పరిశోధన చేయడానికి అవసరమైన సంభావిత, స్పష్టత, ఆచరణాత్మక నైపుణ్యంపై దృష్టి సారించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్‌కు ఈ వర్క్‌షాప్‌లో 6 క్రెడిట్ అవర్స్‌ను ప్రదానం చేశారన్నారు. వైద్య విద్యార్థులు వృత్తి పరమైన అవసరాలకు అనుగుణంగా గ్రూపు కార్యకలాపాలతో పరిశోధన మెథడాలజీ వర్క్‌షాప్ కోసం 16 సెషన్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హెచ్‌ఆర్ కృష్ణారావు, చిత్ర నాగరాజు, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

సమతా సైనిక్‌దళ్ యూత్ అధ్యక్షుడిగా శివకుమార్


నియామకపత్రం అందుకుంటున్న శివకుమార్

గుడిపాల: బాబాసాహెబ్ డాక్టర్ అంబేడ్కర్ సమతా సైనిక్‌దళ్ యూత్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా గుడిపాల మండలంలోని 189 కొత్తపల్లెకు చెందిన శివకుమార్ నియమితులయ్యారు. దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆమూరు సుధాకర్ ఈ మేరకు ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల న్యాయమైన హక్కుల పోరాటాన్ని బలోపేతం చేస్తామన్నారు. అంబేడ్కర్ చేసిన సేవలపై ప్రతి ఎస్సీకీ అవగాహన కల్పిస్తామన్నారు.

రిజిస్ట్రేషన్.. రికార్డు

రియల్ జోష్..వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల క్రయవిక్రయాల పెరుగుదల.. వెరసి రిజిస్ట్రేషన్లు, డాక్యుమెంటేషన్ల సంఖ్య రోజురోజుకూ అధికంగా జరగడం.. ఫలితంగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం గణనీయంగా వృద్ధి చెందింది. ఈ నేపథ్యంలోనే లక్ష్యసాధనలో ఆ శాఖ ముందడుగు వేసి, రికార్డు సృష్టిస్తోంది. దీనిపై ప్రత్యేక కథనం.

- లక్ష్యసాధనలో ముందడుగు
- గత ఏడాది కంటే 20 శాతం వృద్ధి

చిత్తూరు కార్పొరేషన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నిర్దేశిత లక్ష్యం సాధనకు చేరువ దిశగా పయనిస్తోంది. కొన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాలు తమ లక్ష్యాన్ని ఇప్పటికే అధిగమించాయి. కరోనా తర్వాత రిజిస్ట్రేషన్ సేవలు పెరిగాయి. ప్రస్తుతం పలువురు భూములు, భవనాల కొనుగోలుపై పెట్టుబడి పెడుతున్నారు. దీంతో వాటి రిజిస్ట్రేషన్‌కు చెల్లించే స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు ద్వారా ఈ శాఖకు ఆదాయం వస్తోంది. కాగా ఈ శాఖ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్య సాధనకు చేరువగా ఉంది. ఆదాయంలో గతేడాది కంటే అదనంగా 20 శాతం వృద్ధి సాధించింది.

లక్ష్యానికి చేరువలో..

చిత్తూరు జిల్లాలో 8 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. 2022–2023 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.146 కోట్లు కాగా ఇప్పటివరకు రూ.126.54 కోట్ల ఆదాయం సమకూరింది. గత సంవత్సరం కంటే 20 శాతం పురోగతి వచ్చింది. జిల్లాలో 68,500 డ్యాకుమెంటేషన్లు జరగడంతో దాదాపు 89 శాతం వృద్ధి సాధించింది. అంటే ఈ లెక్కన పొలాలు, స్థలాలు, ఇళ్ల రిజిస్ట్రేషన్, తాకట్టు, సెటిల్‌మెంటు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు.



స్టాంప్ పేపర్

పెరిగిన ఆదాయం

చిత్తూరు జిల్లా పరిధిలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ఆదాయం గణనీయంగా పెరిగింది. ఇందులో తొలి ఐదు స్థానాలు కార్వేటినగరం రూ.4.95 కోట్ల లక్ష్యానికిగాను రూ.5.19 కోట్లు ఆదాయంతో టార్గెట్ కంటే 5 శాతం ఎక్కువ ఆర్జించింది. నగరి లక్ష్యం రూ.11.09 కోట్లు వసూలుకాగా రూ.10.57 కోట్లు, పలమనేరు రూ.21.39 కోట్లకు, వసూలు రూ.20.30 కోట్లు, చిత్తూరు రూరల్ రూ.9.47 కోట్లకు, వసూలు రూ.8.80 కోట్లు, బంగారుపాళెం లక్ష్యం రూ.6.41 కోట్లు కాగా ఇప్పటివరకు వసూలు రూ.5.95 కోట్లు సాధించింది.

ప్రాంతం	లక్ష్యం రూ.కోట్లలో..	వసూలు రూ.కోట్లలో..	శాతం
బంగారుపాళెం	6.41	5.95	92
కుప్పం	19.63	14.70	74
పలమనేరు	21.39	20.30	94
పుంగనూరు	23.25	19.01	82
చిత్తూరు ఆర్వో	50.07	42.02	84
కార్వేటినగరం	4.95	5.19	105
నగరి	11.09	10.57	95
చిత్తూరు రూరల్	9.47	8.80	93
మొత్తం	146.39	126.54	

ఆస్తులపై ఆసక్తి

ప్రతి సంవత్సరం భూముల విలువలు పెరుగుతున్నందున ప్రస్తుతం అధిక శాతం మంది ఆస్తుల కొనుగోలుపై పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారు. పిల్లల పెళ్లిళ్లు, చదువులు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని భూమిపై పెట్టుబడి పెడుతున్నారు. జిల్లాల విభజనతో రిజిస్ట్రేషన్లు మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

మార్పు వచ్చింది



భూముల విలువ పెరగడమే కానీ తగ్గడం ఉండదు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం పెట్టుబడులు పెడుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం విస్తరించింది. గతంలో కంటే రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగింది.

– శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.56,000
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,500
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.71,000
రిటైల్ వెండి గ్రాము రూ.73

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	37	25
తిరుపతి	37	24
తిరుమల	33	21
గూడూరు	38	27
నగరి	38	26

మండలాలకు ఓపెన్ స్కూల్ ప్రశ్నపత్రాలు

చిత్తూరు కలెక్టరేట్ : ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షల ప్రశ్నపత్రాలు గురువారం మండల కేంద్రాలకు తరలించారు. రాష్ట్ర విద్యాశాఖ నుంచి జిల్లా కేంద్రానికి ప్రశ్నపత్రాలు చేరాయి. వాటిని డీఆర్వో రాజశేఖర్, డీఈఓ విజయేంద్రరావు సమక్షంలో బందోబస్తు నడుమ మండల కేంద్రాలకు తరలించారు.

వరసిద్ధుడి సేవలో మంత్రి అంబటి


మంత్రి అంబటి రాంబాబు కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు


నీవానదిని పరిశీలిస్తున్న మంత్రి అంబటి, ఎమ్మెల్యే ఆరణి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారిని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబు గురువారం మధ్యాహ్నం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం మంత్రి కుటుంబ సమేతంగా విచ్చేయగా పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు ఎంఎస్ బాబు, ఆరణి శ్రీనివాసులు, ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. మంత్రికి ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, ఇరిగేషన్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నవమిరోజు స్వామివారి దర్శనం నా అదృష్టం

శ్రీరామనవమి రోజు కడపలోని ఒంటిమిట్ట రామాలయంలో సీతారాములు, కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారిని నవమి రోజు దర్శించుకోవడం తన అదృష్టమని ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. స్వామివారి దర్శనానంతరం ఆలయం వెలుపల విలేకరులతో మాట్లాడుతూ నవమి రోజు స్వామివారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని, రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని ఆ స్వామివారిని ప్రార్థించానన్నారు.

నీవానదిని పరిశీలించిన మంత్రి

చిత్తూరు కార్పొరేషన్: సంతపేట వద్ద నీవానదిని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు దంపతులు పరిశీలించారు. వరదల నివారణకు నీవానది చుట్టూ 11 కిలో మీటర్లు రక్షణ గోడలు, కల్వర్టు, చెక్‌డ్యామ్‌లు, బ్రిడ్జిల నిర్మాణానికి రూ.120 కోట్లు కేటాయించాలని గతంలో సీఎంకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో విన్నవించామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంత్రి అంబటికి తెలిపారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ప్రతిపాదనలను సాధ్యమైనంత త్వరలో అమలు చేసేందుకు కృషి చేస్తామని మంత్రి అంబటి హామీ ఇచ్చారు.

చెత్తపెంటలో గంజాయి సాగు



పలమనేరు: మండలంలోని అటవీసమీప గ్రామమైన చెత్తపెంటలో ఓ వ్యక్తి రహస్యంగా గంజాయి సాగుచేస్తున్న విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, సెబ్ అధికారుల కథనం మేరకు.. చెత్తపెంట గ్రామానికి చెందిన అయ్యప్పన్ అనే వ్యక్తి తన పొలంలో రహస్యంగా గంజాయి సాగు చేశాడు. రహస్య సమాచారంతో అధికారులు దాడులు చేశారు. సాగులో ఉన్న గంజాయి మొక్కలు, దాచి ఉంచిన పది గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు స్థానిక సీఐ చంద్రశేఖర్, సెబ్ సీఐ ఎల్లయ్య తెలిపారు.

రామోజీ.. మీకు బాబు మోసాలు కనిపించవా?


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: ఈనాడు అధినేత రామోజీరావు పెన్ను, పేపర్‌కు చంద్రబాబు చేసే మోసాలు కనిపించవా?, రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి కనిపించడం లేదా? అని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ప్రశ్నించారు. బుధవారం పుత్తూరులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'అయ్యా.. రామోజీరావు నా ఆత్మాభిమానాన్ని చంపుకుని నీతో మాట్లాడుతున్నా.. చంద్రబాబు స్కిల్ స్కామ్‌లో అడ్డంగా దొరికి, కంపెనీల పేరుతో ఏవిధంగా డబ్బులు దోచుకున్నాడో, అదే కంపెనీ వారు మాకు ఎలాంటి సంబంధం లేదన్న సాక్ష్యాలతో దేవాలయం లాంటి అసెంబ్లీలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించినప్పుడూ మీ పెన్ను, పేపర్ నిజాలను ఎందుకు రాయలేదు.' అని ప్రశ్నించారు. చంద్రబాబు అంటే రామోజీకి భయమో? లేదా బాబు చేతిలో కీలు బొమ్మ అయ్యారో? అర్థం కావడం లేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో పప్పు, బెల్లంలా ప్రజా ధనాన్ని పంచుతున్నాడని విషప్రచారం చేయడం తప్పు, చంద్రబాబు చేసే కుట్రలు, కుతంత్రాలను ఎందుకు కప్పిపుచ్చుతున్నారని నిలదీశారు. చంద్రబాబు తోకను పట్టుకుని రాజకీయ సముద్రాన్ని ఈదుతున్న రామోజీరావు జీవితం, కంపెనీలు ఒక్కసారిగా పతనం కాక తప్పదని హెచ్చరించారు. జగనన్న నడక నేలపైనే, ఆయన ప్రయాణం పేదలతోనే, ఆయన అభివృద్ధి పేదవారే అని అన్నారు. అలాగే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పోరాటం.. చంద్రబాబు, రామోజీరావు, పవన్‌కళ్యాణ్‌లు వంటి పెత్తందారులపైనేనని హెచ్చరించారు. సింహం లాంటి జగన్‌మోహన్‌రెడ్డి సింగిల్‌గా వస్తాడని, తోడేళ్ల లాంటి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ గుంపులుగానే వస్తారని ఎద్దేవా చేశారు. రామోజీరావూ గుర్తుంచుకో.. చిట్ ఫండ్ కంపెనీ మోసాల్లో చిక్కుకున్న మీకు జైలు కూడు తప్పదని హెచ్చరించారు. కొడాలి నాని, పేర్నినానిలు మంత్రి పదవులు పోయిన పార్టీ అభివృద్ధికి కోసం పోరాటం చేస్తున్నారన్నారు. కావాల్సింది పదవులు కాదని, ప్రజల అభ్యున్నతే అన్నారు.

సాహిత్యం సమాజానికి దిక్సూచి


మాట్లాడుతున్న రామలక్ష్మి

చిత్తూరు రూరల్: సాహిత్య ప్రక్రియ సమాజానికి దిక్సూచి లాంటిదని కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కార కమిటీ అధ్యక్షురాలు రామలక్ష్మి అన్నారు. చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో గురువారం కుప్పం రెడ్డెమ్మ పురస్కారాల ప్రదానం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుభాషను సంరక్షించే దిశగా కవులు, రచయితలు అందరూ సమాజ హితం కోరే రచనలు చేయాలన్నారు. అనంతరం కవులు, రచయితలను సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు బాలకృష్ణారెడ్డి, రోజాప్రియ, నిరంజన్ రెడ్డి, సహదేవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు అక్షరంతోనే జాతి ఉషస్సు


సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

చిత్తూరురూరల్: తెలుగు అక్షరంతోనే తెలుగుజాతి ఉషస్సు అని ఉమ్మడి జిల్లాల న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్ అన్నారు. స్థానిక రెడ్డిభవన్‌లో భారతీయ తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు మద్రిపూడి దేవేంద్రరావు నేతృత్వంలో 'తెలుగు అక్షరం.. తెలుగువారి ఆత్మగౌరవం' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. కాగా వివిధ రంగాలకు సేవలందించిన 24 మంది ప్రముఖులకు ఆత్మగౌరవ అంతర్జాతీయ పురస్కారాలను సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోని తెలుగువారందరూ ఆత్మగౌరవాన్ని మననం చేసుకునే సమయం ఆసన్నమైందన్నారు. ఏడాదిలో తెలుగుభాషపై 11 కార్యక్రమాలను నిర్వహించడం మద్రిపూడి దేవేంద్రరావు సేవలకు నిదర్శనమన్నారు. సంఘ సేవకులు పి.తులసినెహ్రూ సేవలకు గుర్తింపుగా స్త్రీశిరోరత్న బిరుదును, నందిపాటి చక్రపాణికి సేవారాజన్మణి బిరుదును సమాఖ్య ఆధ్వర్యంలో ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు జి.శాంతకుమారి, కొఠారి వెంకటరత్నం, కేసీ లావణ్య, సోము ఉమాపతి, వి.రఘుపతి, గొడుగుచింత గోవిందయ్య, కేఎం బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


కల్యాణోత్సవంలో కలెక్టర్, ఎస్పీ, అడిషనల్ ఎస్పీ


పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎస్పీ, అడిషనల్ ఎస్పీ

చిత్తూరు రూరల్: శ్రీరామనవమి సందర్భంగా చిత్తూరు పీజీఆర్ పోలీసు నివాస సముదాయంలోని రామ మందిరంలో గురువారం సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందుగా కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ జగదీష్ దంపతులు, ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్ శ్రీవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పించారు. అనంతరం సీతారాముల ఉత్సవమూర్తులను కల్యాణ వేదికపై ఆసీనులు చేసి, వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం చేశారు. అనంతరం ఎస్పీ, అడిషనల్ ఎస్పీ దంపతులకు ప్రత్యేకంగా స్వామి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు, పసుపు, కుంకుమ అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ శ్రీనివాసమూర్తి, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, దిశా డీఎస్పీ బాబు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై మాట్లాడే హక్కు బాబుకు లేదు

యాదమరి: అవినీతి గురించి మాట్లాడే హక్కు చంద్రబాబుకు లేదని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు చంద్రబాబు అవినీతి గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ బాబు అవినీతిలో కూరుకపోయారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యే శ్రీదేవి అమ్ముడు పోవడం చాల బాధాకరమన్నారు.

కాణిపాకంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత దర్శించుకున్నారు. గురువారం ఆమె స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు వెస్ట్ సీఐ శ్రీనివాసులురెడ్డి, ఐరాల తహసీల్దార్ సుశీల, ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



నగరి : మున్సిపల్ పరిధి కీళపట్టు హైవే బ్రిడ్జి సమీపంలోని పొదల్లో గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందాడు. ఎస్‌ఐ శివశంకర్ కథనం మేరకు.. కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఏటి గట్టున పొదల వద్దకు వెళ్లిన వారు మృతదేహం చెట్టుకు వేలాడుతుండడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, అతడు ఎవరన్న విషయం గుర్తించలేకపోయారు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి వయస్సు 60–65 సంవత్సరాల మధ్య ఉంటుంది. జంధ్యం ధరించి ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు.

వివాహిత బలవన్మరణం


ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు (ఇన్‌సెట్)లో మంజుల మృతదేహం

గుడుపల్లె: మండలంలోని కనమనపల్లెలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కనమనపల్లె గ్రామానికి చెందిన వెంకటేష్‌కు 5 ఏళ్ల కిందట కుప్పం మండలం ఉర్ల ఓబనపల్లెకు చెందిన మునస్వామి కుమార్తె మంజుల (25)ను వివాహం చేశారు. ఆమెను భర్త వెంకటేష్, అతని తల్లి లక్ష్మమ్మ కలిసి మంజులను వరకట్నం కోసం అప్పుడప్పుడు వేధించేవారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి లక్ష్మమ్మ, వెంకటేష్ గొడవ పడ్డారు. అదే రోజు రాత్రి మంజుల ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉండడం గుర్తించి, ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. ఆత్మహత్యగా కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ బాబు తెలిపారు.

అస్పత్రి ఎదుట ఆందోళన

కుప్పం: గుడుపల్లె మండలం కనమనపల్లెకు చెందిన మంజులను భర్త వెంకటేష్, కుటుంబ సభ్యులు హతమార్చారని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు కుప్పం ఆస్పత్రి వద్ద ఆందోళన దిగారు. స్థానిక పోలీసులు బాధితులకు నచ్చజెప్పడంతో నిరసన విరమించుకున్నారు.